## క్లుప్తంగా

### ఉత్తమ సేవలతో గుర్తింపు



మహబూబాబాద్ రూరల్: ఉద్యోగంలో ఉన్నప్పుడు చేసిన సేవలే ఉద్యోగ అనంతరం కూడా వ్యక్తి గుర్తుండేలా మంచి పేరు ప్రతిష్ఠలు తెస్తాయని అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య అన్నారు. పదవీ విరమణ పొందిన హోంగార్డ్ ఎస్కే హకీంకు మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు.

### మకరతోరణం బహూకరణ

కురవి: మండల కేంద్రంలోని పెద్ద చెరువు కట్టపై యాదవులు నిర్మించిన గంగమ్మ తల్లి ఆలయానికి కురవికి చెందిన శ్రీరాం ఆదిలక్ష్మీ జగన్నాథం కుమారుడు శ్రీరాం జ్యోతినవీన్‌కుమార్ రూ.30వేల విలువైన ఇత్తడి మకర తోరణాన్ని సోమవారం బహూకరించారు.

### సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీలో పందుల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ టి.ప్రసన్నరాణి తెలిపారు. మానుకోట మున్సిపాలిటీలో పందులతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి'లో ఈనెల 10 పందులతో పరేషాన్ అనే శీర్షికన కథనంపై కమిషనర్ స్పందించారు. పందుల పెంపకదారులకు నోటీసులు జారీ చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పందుల పెంపకందారులతో సమావేశం నిర్వహించి వరాహాల కోసం అనంతారం రోడ్డులో కేటాయించిన స్థలంలోకి పంపుతామన్నారు. ఆ స్థలం విషయంలో మరోసారి రెవెన్యూ అధికారులతో మాట్లాడి ఆ సమస్యను కూడా పరిష్కరిస్తామన్నారు.

### ప్రచారపోస్టర్ల ఆవిష్కరణ

డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో సోమవారం పాత పెన్షన్ సాధన సంకల్ప రథ యాత్రకు సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 16 నుంచి ప్రారంభమయ్యే పాత పెన్షన్ సాధన సంకల్ప యాత్ర 33 జిల్లాల మీదుగా కొనసాగనుంది. కార్యక్రమంలో నాయకులు డేవిడ్, మమత, ప్రభుదాస్, సుధాకర్, ప్రదీప్, సారంగం పాల్గొన్నారు.

### నిరసన ర్యాలీ

డోర్నకల్: వక్ఫ్ కోఆర్డినేషన్ జిల్లా కమిటీ సభ్యులు అఖాల్‌ఖాన్‌పై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ డోర్నకల్‌లో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. టీఆర్ఎస్, కాంగ్రెస్, సీపీఎం, ముస్లిం సంస్థలు, నవనిర్మాణ సమితి, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ తదితర సంస్థల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. అఖిల్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, కౌన్సిలర్ సురేందర్‌జైన్, కాంగ్రెస్ నాయకులు సుమేర్‌చంద్‌జైన్, హరికృష్ణ, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

### బాలకార్మికులతో పని చేపిస్తే చర్యలు

దంతాలపల్లి: బాలకార్మికులతో పనిచేపిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కూచిపూడి జగదీష్ అన్నారు. మండల కేంద్రంలో రాజస్థాన్‌కు సంబంధించిన ఓ దాబా హోటల్లో 15 సంవత్సరాల బాలుడు పనిచేస్తున్నాడని తెలుసుకున్న శిశుసంరక్షణ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హోటల్ యజమాని రాముపై కేసు నమోదు చేసి బాలుడిని శిశు సంరక్షణ శాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

### క్రమశిక్షణతో మెలగాలి

మహబూబాబాద్ రూరల్: సమాజంలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ కలిగి, భక్తి మర్యాదలతో జీవించాలని దక్షిణ ఇండియా సంఘం డోర్నకల్ అధ్యక్ష మండల పీఠాధిపతి బిషప్ ది రైట్ రెవరెండ్ డాక్టర్ కె.పద్మారావు, సీఎస్ఐ తెలుగు రాష్ట్ర రీజియన్ డయాసిస్ ఉమెన్ ఫెడరేషన్ అధ్యక్షురాలు రెవరెండ్ కె.విజయపద్మారావు అమ్మగారు అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో సోమవారం ప్రత్యేకంగా డోర్నకల్ గ్రూప్ లెవల్ స్త్రీల మైత్రి రీట్రీట్ నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి గ్రూప్ చైర్మన్ రెవరెండ్ జి.కాంతారావు, వరకుమారి అమ్మవారు పాల్గొన్నారు.

### విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయాలి

మహబూబాబాద్ అర్బన్: జూలై 12న జరిగే పాఠశాలలు, కళాశాలల బంద్‌ను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతకాని రాకేష్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో సోమవారం రాకేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను అందలం ఎక్కిస్తుందన్నారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, మధు పాల్గొన్నారు.

# పుస్తక పఠనంపై పట్టు సాధించాలి

మహబూబాబాద్ అర్బన్: సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు పరిజ్ఞానాన్ని అందించేందుకు విద్యాశాఖ కృషి చేస్తుందని ఎంఈఓ పూల్ చంద్ అన్నారు జిల్లా కేంద్రంలోని హనుమంతుని గడ్డ ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల సోమవారం పుస్తక పఠనం వారోత్సవాలకు ఎంఈఓ హాజరై మాట్లాడారు.. 11వ తేదీన పుస్తక పఠనం ఆవశ్యకతను తెలియజేయాలని, 12, 13వ తేదీల్లో పాఠశాలల్లో ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి పుస్తకాలను సేకరించే కార్యక్రమం నిర్వహించాలని, 14న పఠన సామగ్రి అభివృద్ధి విద్యార్థులతో పేపర్ కట్టింగ్‌లు, కార్టూన్స్, 15న వారోత్సవాల చివరి రోజు పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థులతో పుస్తక పఠనం చేయించాలన్నారు.

**పుస్తకాల పఠనంతో మేథో సంపత్తి**

పెద్దవంగర: పుస్తకాల అధ్యనంతోనే విద్యార్థుల్లో మేథో సంపత్తి పెరుగుతుందని మండల నోడల్ అధికారి అల్లందాసు భిక్షపతి, గంట్లకుంట హెచ్‌ఎం కన్న శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో పట్టణోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు.

**పుస్తకాలపై మమకారం పెంచుకోవాలి**

తొర్రూరు: పుస్తకాలపై మమకారం పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రోహిణి అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి శైలజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: వారోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు



పెద్దవంగర: విద్యార్థులతో పఠనం చేయిస్తున్న ఉపాధ్యాయులు



తొర్రూరు: కస్తూర్బా పాఠశాలలో ..



మహబూబాబాద్ రూరల్: మాధవాపురంలో..

కేసముద్రం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కల్వల జెడ్పీఎస్ఎస్‌లో పఠనోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సమ్మెట వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు చీకటి వెంకట్రాంనర్సయ్య, నర్సయ్య, రాజేంద్రాచారి పాల్గొన్నారు.

**మేథో వికాసానికి పఠనం ప్రాణవాయువు**

మహబూబాబాద్ రూరల్: మేథో వికాసానికి పఠనోత్సవం ఒక ప్రాణవాయువులా దోహదపడుతుందని హెచ్‌ఎం సంకా బద్రినారాయణ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మాధవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులచే పుస్తక పఠనం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్నేహలత, సుజాత, సౌభాగ్య పాల్గొన్నారు.

## క్రీడా పోటీలు

కేసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్‌లో కేసముద్రం, ఇనుగుర్తి మండలాల నుంచి 4, 5వ తరగతికి చెందిన 65మంది విద్యార్థులకు సోమవారం 9 క్రీడాంశాలపై ఎంపిక పోటీలను నిర్వహించారు. కేసముద్రం నుంచి 10 మంది, ఇనుగుర్తి నుంచి 5గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 12న మహబూబాబాద్‌లో నిర్వహించనున్న జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో పాల్గొంటారని పీఈటీ కొమ్ము రాజేందర్, నసీర్, కొప్పుల శంకర్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శాంతకుమారి, పీడీ నాగయ్య, పీఈటీలు రామయ్య, రాజేందర్, బిక్షపతి, నసీరుద్దీన్, మధుకర్, కవిత పాల్గొన్నారు.

## ఆర్థికసాయం

కేసముద్రం: మండలంలోని కోరుకొండపల్లి గ్రామానికి చెందిన చొప్పరి రాజశేఖర్ అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈమేరకు గీతాంజలి హైస్కూల్‌కి చెందిన 2008-09 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థులు మృతుడి కుమార్తె స్మైలీ పేరున రూ.50వేలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాధిత కుటుంబానికి సోమవారం అందజేశారు.

# బీసీలకు 70 అసెంబ్లీ సీట్లు ఇస్తాం..

గార్ల: గతంలో ఏ పార్టీ ఇవ్వని విధంగా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు 70సీట్లు ఇస్తామని ఇటీవల బీఎస్పీ పార్టీ రాష్ట్ర చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రకటించారని బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేష్ చౌహాన్ వెల్లడించారు. సోమవారం గార్ల వర్తక సంఘం భవనంలో జరిగిన పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రానున్న ఎన్నికల్లో బీసీలకు 70సీట్లు ఇచ్చే దమ్ము, ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. ఇల్లందు నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థి బాదావత్ ప్రతాప్‌ను గెలిపించేందుకు బహుజనులంతా ఏకం కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అజ్మీర వెంకన్న, ఇల్లందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాదావత్ ప్రతాప్, నాయకులు రమణీ, వినయ్, శ్రీనివాస్, సుధాకర్, మల్లేష్, జీవన్, మోహన్, రామ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటేష్ చౌహాన్

# గ్రాట్యుటీ రూ.5లక్షలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

మహబూబాబాద్: అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీగా రూ.5లక్షలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఆకుల రాజు, కుంట ఉపేందర్, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సంపూర్ణ, స్నేహబిందు డిమాండ్ చేశారు. అఖిల భారత డిమాండ్స్ డే సందర్భంగా యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐసీడీఎస్ రంగానికి కేంద్రం బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన జాతీయ విద్యావిధానం పేరుతో అంగన్‌వాడీ వ్యవస్థను ఎత్తివేయాలని కేంద్రం ప్రయత్నం చేస్తుందన్నారు. అధికారుల తీరు మార్చుకోవాలని, బెదిరింపులకు పాల్పడుతున్నారని అది సబబుకాదన్నారు. కార్యక్రమంలో సరోజ, తిరుపతమ్మ, రఫియా, జ్యోతి, లలిత, అండాలు, మంగమ్మ, స్వరూప, పద్మ నాయకులు నాగన్న, సమ్మెట రాజమౌళి, దుర్గారావు పాల్గొన్నారు.

# గుడిసెలు కూల్చేయడం అన్యాయం

కురవి: ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటే ప్రైవేట్ వ్యక్తులతో రెవెన్యూ అధికారులకు కుమ్మక్కై, వేసుకున్న గుడిసెలను కూల్చివేయడం అన్యాయమని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. సోమవారం సీపీఐ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు ప్రైవేటు వ్యక్తుల కొమ్ముకాయడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్ రెడ్డి, రాజన్న, శ్రీనివాస్, సమ్మయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయసారథి

# టేకు చెట్ల నరికివేతపై విచారణ

తొర్రూరు: పట్టా భూమిలోని విలువైన టేకు చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేసిన ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలోని భూమిలో నరికిన టేకు దుంగలను తహసీల్దారు నాగేంద్ర ప్రసాద్ పరిశీలించారు. 229 సర్వే నంబర్‌లో కిన్నెర యాకయ్యకు చెందిన 1.20 ఎకరాల భూమిలో 100 మేర టేకు మొక్కలు నాటగా దానిలో 40 మొక్కలు నరికివేసినట్లు తహసీల్దార్ ధ్రువీకరించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆలిండియా బేడ బుడగ జంగాల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు తూర్పాటి పాండు కోరారు. విచారణలో ఆర్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సర్వేయర్ నవీన్, బాధితులు పాల్గొన్నారు.

# 'మా భూమి మాకు ఇప్పించండి'

నర్సింహులపేట: మా భూమి మాకు ఇప్పించాలని, మండలంలోని అధికార పార్టీ నాయకుడు భూకబ్జాకు ప్రయత్నం..? చేస్తున్నట్లు ఓ డిఫెన్స్ ఉద్యోగి పూల్‌సింగ్ అవేదన సోమవారం వాట్సాప్ గ్రూపుల్లో విస్తృతంగా ప్రచారం జరగడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై బాధితుడు ఫోన్‌లో మాట్లాడుతూ.. మండలంలోని వంతడపల గ్రామ పరిధిలోని 32 సర్వే నంబర్‌లో ఉన్నటువంటి భూమిలో కొంత మేరకు భూమిని అధికార పార్టీ నాయకుడు కబ్జాకు ప్రయత్నం చేస్తున్నారని, సుమారు 20సంవత్సరాల నుంచి సాగులో ఉన్నామన్నారు. న్యాయం చేయాలని పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశామని, నేటికి పరిష్కారం కాలేదన్నారు. దీనిపై స్థానిక సీఐ మంగీలాల్‌ను వివరణ కోరగా.. సుమారు 20 రోజులు కిందనే భూమి గొడవపై ఇరువురు ఫిర్యాదు చేసుకోగా ఇరువురు పూల్‌సింగ్, నాయకుడు యాదగిరిరెడ్డిపై కేసు నమోదు చేశామని, దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. అనంతరం తహసీల్దార్ వివేక్‌ను వివరణ కోరగా.. ఉన్నాతాధికారుల సూచన మేరకు ఇరువురి భూతగాదాపై సర్వే నిమిత్తం డివిజన్ స్థాయి అధికారికి రిపోర్ట్ పంపామని, సర్వేయర్ రాగానే ఇరువురి సమక్షంలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తామన్నారు. యాదగిరిరెడ్డి వివరణ కోరగా.. నాకున్న భూమిలో కొంత విరాళం, కొంత అమ్మకం చేశామని, మిగిలిన భూమి కోసం పూర్తి అధారాలతో కోర్టుకు వెళ్లి ఇన్‌జంక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నానని తెలిపాడు.

## కొనసాగుతున్న సమ్మె

సాక్షి నెట్‌వర్క్: గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న సిబ్బందికి వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని చేస్తున్న సమ్మె సోమవారం నాటికి ఐదో రోజుకు చేరుకుంది. దీక్షకు పలు సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. వెంటనే ప్రభుత్వం జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జీపీ కార్మికులు పాల్గొన్నారు.

## అదనపు బస్సు ప్రారంభం

డోర్నకల్: చిలుకోడు శివారు మోడల్ స్కూల్‌కు మహబూబాబాద్ డిపో నుంచి సోమవారం అదనపు బస్సు ఏర్పాటైంది. ప్రిన్సిపాల్ కృష్ణభాను డిపో మేనేజర్‌ను విజ్ఞప్తి చేయగా మేనేజర్ తొడేళ్లగూడెం, వెన్నారం, ఉయ్యాలవాడ, డోర్నకల్ మీదుగా బస్సు ప్రారంభమైంది. విలేజ్ బస్ ఆఫీసర్ రవికుమార్ ఆధ్వర్యంలో బస్సు మోడల్ స్కూల్‌కు చేరుకుంది.

# వచ్చే ఎన్నికల్లో నేనే గెలుస్తా..

● ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

కురవి: నిత్యం జనంలోనే ఉంటున్నాను.. వచ్చే ఎన్నికల్లో డోర్నకల్ నుంచి గెలుస్తానని డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండలంలోని సూదనపల్లి, కందికొండ, బీబీనాయక్ తండా, కొత్తూరు(సీ) గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈసందర్భంగా జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ.. 'బొద్దికూర, జొన్న రొట్టె తిన్నోడిని.. ఎవరికి భయపడను, ఎవరెన్ని చేసినా భయపడేది లేదు.. తానే గెలిచి తీరుతానని స్పష్టం చేశారు. తనకు వ్యాపారాలు లేవు, రియల్ ఎస్టేట్ దందాలు లేవు, ఒక్క అవినీతి ఉంటే నిరూపించండి అని సవాల్ చేశారు. కొందరు లొల్లి పెట్టించి సోషల్ మీడియాలో పెట్టిస్తున్నారు, అయినా నాకేం కాదన్నారు. కందికొండ గుట్ట నుంచి అయ్యగారిపల్లి వరకు రూ.3కోట్లతో రోడ్డు మంజూరు చేస్తానని, 50 గృహాలు ఇస్తానన్నారు. ఓటు వేసే సమయంలో పొరపాటు చేస్తే ఒక్క పనికాదని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేద్దామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దున్న పూలమ్మ, వద్దూరి పద్మ, యానాల గంగాధర్‌రెడ్డి, ఎంపీటీసీ అడిదెల దేవేందర్, ఎంపీపీ గుగులోత్ పద్మావతి, వైస్ ఎంపీపీ దొంగలి నర్సయ్య, ఆర్‌బీఎస్ కోఆర్డినేటర్ ముండ్ల రమేష్, ఆత్మ చైర్మన్ తోటలాలయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

# పెంచిన వేతనాలు అమలు చేయాలి



మహబూబాబాద్ అర్బన్: మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన దీక్షలో మాట్లాడుతున్న ఉపేందర్

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులకు 2022 మార్చిలో అసెంబ్లీలో ప్రకటించిన వేతనాలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎంఈఓ కార్యాలయం ఎదుట టోకెన్ సమ్మెను ప్రారంభించారు. సమస్యలు పరిష్కరించాలని ఈనెల 12న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, రుజన్న, పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకుల పెండింగ్ బిల్లులతో విద్యార్థుల పస్తులు ఉంటున్నారని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ అన్నారు.

గార్ల: మధ్యాహ్న భోజన వర్కర్లకు గత మార్చి నుంచి పెంచిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈధర్నాను ఉద్దేశించి సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో వర్కర్లు రేణుక, పద్మ, కళమ్మ, అలివేలు, సరోజ, అనసూయ, దేవి పాల్గొన్నారు.

డోర్నకల్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు దాసరి మల్లేశం డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట సోమవారం దీక్ష చేపట్టారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, కార్మికులకు కనీస వేతనం అందించాలని కోరారు. కార్యక్రమంలో ధనలక్ష్మి, సరోజ, ఉపేంద్ర, లక్ష్మి, మైబు పాల్గొన్నారు.

## ఎస్టీ జాబితాలో కలపాలి

మహబూబాబాద్ రూరల్: మందుల కులాన్ని ఎస్టీ జాబితాలో కలపాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఖమ్మంలో కలిసి సోమవారం మందుల కుల సంఘం ఎస్టీ పోరాట సమితి అధ్యక్షుడు పింద్రాల రాందాసు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సాయి, కరుణాకర్, డేవిడ్, ఇషాక్, రాము పాల్గొన్నారు.

## '108'కి మరమ్మతులు చేపట్టాలి

గార్ల: గార్ల సీహెచ్‌సీ కి కేటాయించిన 108 వాహనం మరమ్మతుకు గురై నిరుపయోగంగా ఉందని వెంటనే మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీపీ ఎం.శివాజీచౌహాన్ జిల్లా వైద్యాధికారులను డిమాండ్ చేశారు. సోమవారం గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రి ఎదుట నిలిచిపోయిన 108 వాహనం ఆయన పరిశీలించారు.

## సంక్షిప్త సమాచారం

**ఎరుకల సంక్షేమానికి కృషి చేయాలి**

డోర్నకల్: ఎరుకల కులస్తులకు ప్రభుత్వ పథకాలను కేటాయిస్తూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేయాలని ఎరుకుల సంఘం మండల అధ్యక్షుడు రుద్రాక్షల రామ్మోహన్ డిమాండ్ చేశారు. మండలంలోని చిలుకోడు గ్రామంలో సోమవారం ర్యాలీ నిర్వహించి గ్రామ ప్రధాన కూడలిలోని ఏకలవ్య విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సంఘ గ్రామ అధ్యక్షులు రాగం లాజర్, ప్రభాకర్, ఏసు, బుచ్చయ్య, లక్ష్మయ్య, రాములు పాల్గొన్నారు.

**దరఖాస్తుల ఆహ్వానం**

కొత్తగూడ: కొత్తగూడ పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సుగా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేసేందుకు మండలానికి చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి శివప్రసాద్ తెలిపారు. జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ చేసిన వారు అర్హులు అని తెలిపారు. నెలకు రూ.12వేల గౌరవ వేతనం ఐటీడీఏ ద్వారా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు మంగళ, బుధ వారాల్లో పీహెచ్‌సీలో సంబంధిత సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

**31లోపు దరఖాస్తు చేసుకోవాలి**

గార్ల: అంబేద్కర్ ఓపెన్ డిగ్రీలో అడ్మిషన్ల కోసం అభ్యర్థులు ఈనెల 31వ తేదీ లోపు మీసేవ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఓపెన్ డిగ్రీ అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ ఎ.నర్సమ్మ సోమవారం తెలిపారు. ఇంటర్, పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఓపెన్ డిగ్రీ చదువుకునే అవకాశం ఉన్నందున అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

**గొడుగుల పంపిణీ**

తొర్రూరు రూరల్: మండలంలోని వెంకటాపురం గ్రామంలోని దళిత కాలనీకి చెందిన పేదలకు సోమవారం వాసవి క్లబ్ సభ్యుడు మాశెట్టి యుగేందర్ జన్మదినాన్ని పురస్కరించుకొని గొడుగులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగన్న గౌడ్, క్లబ్ అధ్యక్షుడు వజినెపల్లి అనిల్‌కుమార్, క్లబ్ నాయకులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు చేయూత**

పెద్దవంగర: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠశాల్లో భౌతికశాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయురాలు హైమా సాకారంతో స్నేహితులు బత్తుల సరిత సతీష్ దంపతులు రూ.15వేలు విలువ చేసే టై, బెల్ట్‌లు, బ్యాడ్జిలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**వైఎస్సార్ టీపీతోనే సామాన్యులకు న్యాయం**

తొర్రూరు: వైఎస్సార్ టీపీతోనే సామాన్యులు, పేదలకు న్యాయం చేకూరుతుందని ఆ పార్టీ జిల్లా నాయకులు పంజాల యాకేందర్‌గౌడ్ తెలిపారు. సోమవారం డివిజన్ కేంద్రంలో వైఎస్సార్ టీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. యాకేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. వైఎస్ షర్మిల నాయకత్వంలో మహానేత రాజశేఖరరెడ్డి ఆశయాలు సాధిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పంజాల సాయిగౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

**ఎద్దు దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు**

గార్ల: మండలం సీతంపేట గ్రామంకు చెందిన కైలా ఎల్లారావు అంకన్నగూడెం గ్రామ సమీపంలోని తన పొలంలోకి వచ్చిందని ఎద్దును వెళ్లగొట్టే సమయంలో ఆ ఎద్దు తిగరబడి దాడి చేసింది. తీవ్ర గాయాలైన క్షతగాత్రుడిని 108 వాహనంలో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

**కేఎస్‌పీఎస్ నూతన కమిటీ ఎన్నిక**

తొర్రూరు: కౌండిన్య సహకార పరపతి సంఘం నూతన కమిటీని సోమవారం డివిజన్ కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా నాగపురి అశోక్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కుంభం మహేష్ కుమార్‌గౌడ్, కోశాధికారిగా వెంకటేశ్వర్లు గౌడ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**రేపు మానుకోటకు హనుమంతరావు రాక**

మహబూబాబాద్ రూరల్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ పీసీసీ అధ్యక్షులు, మాజీ రాజ్యసభ సభ్యులు వీ.హనుమంతరావు ఈనెల 12వ తేదీ బుధవారం ఉదయం 11:30 నిమిషాలకు మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి వస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు మేకల వీరన్నయాదవ్ తెలిపారు. క్యాక్రమంలో కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షులు ఘనపురపు అంజయ్య, కిసాన్ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్, తదితరులు పాల్గొన్నారు.

**బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శిగా సుధాకాంత్**

బయ్యారం: బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శిగా కోట సుధాకాంత్, పార్టీ సోషల్ మీడియా మండల ఇన్‌చార్జ్‌గా కేదాసు గిరిని నియమిస్తూ బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేష్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం బయ్యారంలో నియామక ఉత్తర్వులు అందజేశారు.

**ఆశ్రమ పాఠశాలలో ఎన్నికలు**

మహబూబాబాద్ రూరల్: ప్రజాస్వామ్య పద్ధతిలో మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో సోమవారం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలలో విద్యార్థుల ద్వారా పాఠశాల ఎస్పీఎల్, వాయిస్, వాయిస్ ఎస్పీఎల్ ఎన్నికల ప్రక్రియ ద్వారా పాఠశాల విద్యార్థులు నాయకులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డీసీఎస్ శర్మ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

**యువతకు నైపుణ్య శిక్షణ**

మహబూబాబాద్ అర్బన్: దైవకృప వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో యువతకు నైపుణ్య శిక్షణ స్వయం ఉపాధి అవగాహన సదస్సు ఈనెల 12న బుధవారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు అనాథాశ్రమం నిర్వాహకుడు బానోత్ లోకేష్ సోమవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల ఎదురుగా న్యూబిల్డింగ్ ఏసీ హాలులో ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహిస్తున్నామన్నారు. 18నుంచి 40సంవత్సరాల వయసు గల యువతీయువకులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 77804 89623, 86396 55334 నంబర్లను సంప్రదించాలన్నారు.

**ఎస్ఎఫ్ఐ ఆందోళన**

కురవి: పశ్చిమబెంగాల్‌లో జరిగిన జీపీ ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ జాతీయ సహాయ కార్యదర్శి దిప్సితధర్ తోపాటు మరికొందరిపై టీఎంసీ గుండాలు దాడి చేయడం అన్యాయమని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి గంధసిరి జ్యోతిబసు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆందోళ చేశారు. కార్యక్రమంలో నాయకులు వీరేందర్, మహేష్, ప్రవీణ్, వినయ్ పాల్గొన్నారు.

**గుడిసెలోకి దూసుకెళ్లిన కారు**

బయ్యారం: మండంలోని ఇల్లందు-మహబూబాబాద్ ప్రధాన రహదారి పక్కన సత్యనారాయణపురంస్టేజీ వద్ద ఉన్న పూరిగుడిసెలోకి ఓ కారు దూసుకెళ్లింది. బయ్యారం నుంచి ఇల్లందు వైపు వెళ్తున్న కారు స్టేజీ వద్ద అదుపుతప్పి పూరిగుడిసెలోకి దూసుకెళ్లడంతో కిరాణం నిర్వహిస్తున్న మాలోత్ హరికి గాయాలయ్యాయి.

**సమస్యలను తేలికగా తీసుకోవాలి**

బయ్యారం: విద్యార్థులు సమస్యలను తేలికగా తీసుకోవాలని ఏకలవ్య పాఠశాల హెచ్‌ఎం కె.రవిబాబు సూచించారు. మండలంలోని నామలపాడులోని ఏకలవ్య పాఠశాల ఆవరణంలో సోమవారం వాయిస్ ఫర్ గర్ల్స్ ఫేస్-2( దిశ) ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ గీత, కోర్సు డైరెక్టర్ అంకిత పాల్గొన్నారు.

## బీసీలకు అవకాశం కల్పించాలి

నెహ్రూసెంటర్: పార్లమెంట్, అసెంబ్లీ, ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యేందుకు అవకాశం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండగాని వేణు అన్నారు. బీసీల రాజ్యాధికార పోస్టర్‌ను సోమవారం స్థానిక అమరవీరుల స్థూపం వద్ద ఆవిష్కరించి వేణు మాట్లాడారు. ఈనెల 15వ తేదీన కేబీఆర్ పార్క్‌లో బీసీల రాజ్యాధికారం కోసం ప్లీనరీ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సదస్సుకు జిల్లాలోని బీసీలందరూ పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు ప్రభాకర్, ప్రచార కార్యదర్శి రామరాజు ఉపేందర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నూరి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## నోట్‌బుక్స్ పంపిణీ

కేసముద్రం/నెల్లికుదురు: ఇనుగుర్తి మండల కేంద్రంతోపాటు, అయ్యగారిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఇనుగుర్తి జెడ్పీఎస్ఎస్‌కి చెందిన 1986-87 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు సోమవారం ఉచితంగా నోట్‌బుక్స్ అందజేసినట్లు బ్యాచ్ కమిటీ చైర్మన్ చంద్రప్రకాశ్ తెలిపారు.

**వైద్యశిబిరం**

దంతాలపల్లి/చిన్నగూడూరు/డోర్నకల్: ఆయా మండలాల్లో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు తెలిపారు.

## ప్రాణహాని ఉంది రక్షణ కల్పించండి..

గూడూరు: తనకు కొందరి ద్వారా ప్రాణహాని ఉందని మండల కేంద్రానికి చెందిన డాక్టర్ ఏపూరి రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గూడూరు మండల కేంద్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తనను చంపేందుకు సుపారీ తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. దీంతో తనకు ప్రాణహాని ఉందని ఎస్పీని కలిశానని తెలిపారు. తన వినతి మేరకు స్పందించిన ఎస్పీ.. విచారణ జరిపాలని గూడూరు పోలీసులను ఆదేశించారని తెలిపారు. కాగా.. ఈ విషయమై ఎస్సై రాణాప్రతాప్‌ను వివరణ కోరగా రవీందర్‌రెడ్డి తన హత్యకు కుట్ర జరుగుతుందని ఫిర్యాదు చేయగా ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.